ఘనంగా వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించిన అర్చకులు



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవులలోని శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం 9గంటలకు స్వామి వారికి అష్టోత్తర శత కలశాభిషేకం, హారతి, ప్రసాద గోష్ఠిలు నిర్వహించారు. సాయంత్రం 5గంటలకు గరుడ వాహన సేవ, ఎదురుకోళ్లు, రాధాకృష్ణుల సాంస్కృతిక నృత్యాలు, రాత్రికి స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. మంత్రోచ్చారణల మధ్య వేదపండితులు కల్యాణ ఘట్టాలను వివరించారు. డ్రీమ్ వ్యాలీ రిసార్ట్ ఎండీ సంతోష్‌రెడ్డి దంపతులు, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ దంపతులతో పాటు మంచిరేవుల గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు. సోమవారం సహస్రనామ పుష్పార్చన, ఉంజల్‌సేవ, సాయంత్రం 6గంటలకు శేషవాహన సేవ, రథోత్సవం చేయనున్నారు.

వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయం అవసరం

జాతీయ వ్యవసాయ పరిశోధనల యాజమాన్య సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు

ఏజీవర్సిటీ: దేశంలో గ్రామీణ ప్రజలు 70 శాతం వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని, జాతీయ స్థూల ఉత్పత్తిలో ఇది 17 శాతమని, జాతీయ వ్యవసాయ పరిశోధనల యాజమాన్య సంస్థ డైరెక్టర్ సి. శ్రీనివాస్‌రావు అన్నారు. ఈ నేపథ్యంలో వాతావరణ మార్పులను తట్టుకొనే వ్యవసాయం అవసరమని పేర్కొన్నారు. ఆదివారం రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని వాటర్ టెక్నాలజీ విభాగంలో వాతావరణ మార్పులను తట్టుకోగల వ్యవసాయ నిర్మాణం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. అరబిండో ఫౌండేషన్, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో పలువురు వ్యవసాయ నిపుణులు పాల్గొని, రైతులకు లాభాలు వచ్చేలా వ్యవసాయం ఏ విధంగా ఉంటే బాగుంటుందో సూచించారు. ప్రతికూల పరిస్థితిని ఎదుర్కొగలిగే సమగ్ర వ్యవసాయ విధానాలు అవసరమన్నారు. ముఖ్యంగా నీటి యాజమాన్యంలో సూక్ష్మ సాగునీటి పద్ధతిలో వినియోగం, వాననీరు సేకరణ, నిల్వ, మల్చింగ్, నేల తేమ సంరక్షణ, తేలికపాటి దుక్కి, పరీవాహక ప్రాంత యాజమాన్యం, నేల కోత కాకుండా చూడటం, వరద నీటి సంరక్షణ వంటి అనేక అంశాలపై అవగాహన కల్పించారు. వర్షాభావ పరిస్థితులు పంటల దిగుబడిని ఎక్కువగా దెబ్బతీస్తున్నాయని అన్నారు. వరికి బోనస్ ఇవ్వాలని, రైతులకు, కౌలు రైతులకు ఎకరాకు రూ.7,500 రైతు భరోసా ఇవ్వాలని, పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేనిపక్షంలో తగిన మూల్యాన్ని చెల్లించుకోవల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు శోభన్, అరబిండో ఫౌండేషన్ కార్యదర్శి మనోహర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రజావాణి పునఃప్రారంభం

రాజేంద్రనగర్: స్థానిక సర్కిల్ కార్యాలయంలో సోమవారం నుండి ప్రజావాణి కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభిస్తున్నట్లు ఉప కమిషనర్ రవి కుమార్ తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. కోడ్ ముగియడంతో పునఃప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకూ సర్కిల్ కార్యాలయంలోని మొదటి అంతస్తు మీటింగ్ హాల్లో కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. దీనికి జీహెచ్ఎంసీలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది హాజరవుతారని తెలిపారు. అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్లకు చెందిన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులకు వివరించాలని కోరారు. సంబంధిత అధికారులు, సిబ్బంది అక్కడే ఉంటారని.. సమస్య పరిష్కారం కోసం వెంటనే తగు చర్యలు తీసుకుంటారని వెల్లడించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్కిల్ ప్రజలను కోరారు.

‘శ్రీనికేతన్’ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న 2004-2005 బ్యాచ్ ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు

రాజేంద్రనగర్: రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ అత్తాపూర్ రాంబాగ్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీనికేతన్ హైస్కూల్ రాంబాగ్‌లో 2004–2005 బ్యాచ్ ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులంతా 20 సంవత్సరాల తరువాత కలవడం ఆనందకరంగా అనిపించింది. అదే విధంగా విద్యార్థులు 20 సంవత్సరాల తరువాత తమ విద్యార్థులను కలవడం, ప్రతి ఒక్కరూ తమ తమ ప్రొఫెషనలో సెటిల్ కావడంతో ఉపాధ్యాయులు ఆనందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరువులో వ్యర్థాలు డంపింగ్



వట్టినాగులపల్లి గౌని చెరువులో పోసిన మట్టి

మణికొండ: చెరువు స్థలంలో గుర్తు తెలియని వ్యక్తులు వ్యర్థాలను డంపింగ్ చేస్తున్నారు. దీంతో చెరువు స్థలం కుంచించుకుపోతోంది. అర్ధరాత్రుళ్లు కొందరు ఇళ్ల, ఇతర వ్యర్థాలను ట్రాక్టర్లు, లారీల ద్వారా వట్టినాగులపల్లి గ్రామాన్ని ఆనుకుని ఉన్న గౌని చెరువులో డంపింగ్ చేస్తున్నారు. ఈ గ్రామం నార్సింగ్ మున్సిపాలిటీ పరిధిలోకి వస్తుందని, అధికారులు దీనివైపు పట్టించుకున్న పాపాన పోలేదని, పరిస్థితి ఇలానే కొనసాగితే చెరువు పూర్తిగా కుంచించుకుపోయి, వర్షాకాలం వచ్చే వరదకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సరైన డ్రైయిన్లు లేక అవస్థలు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు.

వర్షాకాలం వస్తే...

రానున్నది వర్షాకాలం కావడంతో చెరువు ఆక్రమణకు గురైతే వర్షం నీరు పోయేందుకు అవకాశం ఉండదని, దీంతో గ్రామంలోని ఇళ్లలోకి నీరుచేరే ప్రమాదం ఉందని, ముంపు పరిస్థితులు తలెత్తే అవకాశమూ లేకపోలేదని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాక్టర్లు, టిప్పర్ల యజమానులపై చర్యలు తీసుకుని చెరువును రక్షించాలని కోరుతున్నారు.

వ్యక్తి దారుణ హత్య

- ఆర్థిక లావాదేవీలు, వ్యక్తిగత కక్షలే కారణమా?
- ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నంబర్ -258 హసన్‌నగర్ వద్ద ఘటన



మృతుడు లాహిఖ్ (ఫైల్)

అత్తాపూర్ : ఓ వ్యక్తిని గుర్తు తెలియని కొందరు వెంబడించి హత్యచేసిన ఘటన ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నంబర్ -258 హసన్‌నగర్ వద్ద శనివారం రాత్రి చోటు చేసుకుంది. రాజేంద్రనగర్ ఏసీపీ తూల శ్రీనివాస్, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకటరామిరెడ్డి వివరాల ప్రకారం.. లాల్ దాబా అసలునగర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ లాహిఖ్(42) డ్రైవర్‌గా పని చేస్తున్నారు. శనివారం స్నేహితులతో కలిసి మద్యం సేవించి ఇంటికి తిరిగి వస్తే క్రమంలో రాత్రి 11:30 గంటల ప్రాంతంలో కొందరు వెంబడించారు. పీవీ నగసింహారావు ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నెంబర్ -258 హసన్ నగర్ వెళ్లే దారిలో బీరు సీసాలు, పదునైనా కత్తులతో దాడి చేసి పారిపోయారు. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్, అత్తాపూర్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. మహ్మద్ లాహిఖ్ అప్పటికే మృతి చెందడంతో శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి తండ్రి, భార్యా, పిల్లలున్నారు. తండ్రి మహమ్మద్ మోహిన్ చాయ్ బండి నిర్వహిస్తాడు. పథకం ప్రకారమే అతని స్నేహితులు ఈ హత్య జరిగి ఉండొచ్చని, ఆర్థిక లావాదేవీలు, వ్యక్తిగత కారణాలై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

శ్మశానవాటిక రోడ్డు బురదమయం

- అంత్యక్రియలకు తీవ్ర ఇబ్బందులు
- నడవలేక స్థానికులు, ప్రజల అవస్థలు
- తీర్మానం చేసినా ప్రారంభం కాని పనులు
- దళిత శ్మశాన వాటికపై అధికారుల చిన్నచూపు



బురద రోడ్డులో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మణికొండ: అది దళిత శ్మశానవాటిక. అనాదిగా వస్తున్న దారి. అందులో వాహనాలు ప్రయాణిస్తుండటం, వర్షాలు కురుస్తుండటంతో బురద, గుంతల మయంగా తయారైంది. అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వచ్చిన ప్రజలు ఆ దారిలో నడవలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారుల మాత్రం చిన్నచూపు చూస్తున్నారని పలువురు స్థానికులు వాపోతున్నారు. మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని శివపురి కాలనీ పక్కనే దళితుల శ్మశాన వాటిక ఉంది. దానికి బుల్కాపూర్ నాలా వేంట దారి ఉంది. వర్షాకాలం వచ్చిందంటే అది కాస్తా బురదమయంగా మారుతుండటంతో స్థానికులు అంత్యక్రియలు నిర్వహించేందుకు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి చెందిన ఓ మహిళ ఆదివారం మృతి చెందటంతో అంత్యక్రియలు నిర్వహించారు. దీంతో శ్మశాన వాటికకు వెళ్లే వారు అదే బురద గుంతల నుంచి ఇబ్బందులు పడుతూ నడవలేక వెళ్లారు.

అధికారుల చిన్నచూపు...

హైటెక్ భవనాలతో అభివృద్ధి చెందిన మణికొండ మున్సిపాలిటీ శ్మశానవాటిక రోడ్డు ఇలా ఉండటంపై పలువురు పెదవి విరుస్తున్నారు. గతంలోనే స్మశాన వాటిక వరకూ రోడ్డు నిర్మాణానికి మున్సిపాలిటీ నిధులను కేటాయించారు. అయితే బుల్కాపూర్ నాలా మీదుగా రోడ్డు వేయవద్దనే కారణంతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పనులను అనుమతించలేదని మున్సిపల్ నాయకులు, అధికారులు చెబుతున్నారు. ప్రజల ఇబ్బందులను గమనించి ఇప్పటికైనా శ్మశానవాటిక వరకూ రోడ్డు వేసేందుకు ప్రస్తుత జిల్లా కలెక్టర్ అనుమతులు ఇవ్వాలని, దళిత కాలనీలపై అధికారుల చిన్నచూపు విడనాడాలని వారు కోరుతున్నారు. అనేక చోట్ల అదే బుల్కాపూర్ నాలాను పూడ్చి భవనాలు నిర్మించి, రోడ్లు వేయగా లేనిది దళిత శ్మశాన వాటిక రోడ్డును మాత్రం అడ్డుకోవటం వివక్షకు తావిస్తోందని, ఇది సరికాదని వారు పేర్కొన్నారు.



బురద మయంగా మారిన మణికొండ దళిత శ్మశానవాటిక రోడ్డు

పేదలకు అండగా మజ్లిస్: ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: పేదలకు అండగా మజ్లిస్ పార్టీ ఉంటుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం కార్వాన్, గోల్కొండ డివిజన్‌లకు చెందిన పలువురు టోలిచౌకీలోని ఆయన కార్యాలయానికి చేరుకొని కలిశారు. ఈ సందర్భంగా వారు తమ తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ఓ మహిళ తనకు మూడు నెలల నుంచి బ్యాంక్ ఖాతాలో పెన్షన్ రావడం లేదని ఎమ్మెల్యేకు వివరించింది. మరో వ్యక్తి తన కూతురు వివాహానికి షాదీముబారక్ పథకానికి దరఖాస్తు చేసుకున్నానని ఇప్పటి వరకు తనకు ఎటువంటి సమాచారం రాలేదన్నారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరు నెలల నుంచి ఎన్నికల కోడ్ అమలులో ఉండడం, రాష్ట్రంలో ప్రభుత్వం మారడం తదితర కారణాల వల్ల సంక్షేమ పథకాల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండిపోయాయన్నారు. ఈ నెల నుంచి దరఖాస్తుల పరిశీలన ప్రారంభమైందని ఆయన అన్నారు. త్వరలో తాను జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులను కలిసి సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను అందజేస్తానన్నారు.

గోల్కొండ కోట బోనాలకు దేశవ్యాప్త గుర్తింపు



సమావేశంలో ఏసీపీ సయ్యద్ ఫయాజ్, రాజు వస్తాద్ తదితరులు

గోల్కొండ: గోల్కొండ కోట బోనాలకు తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత దేశవ్యాప్త గుర్తింపు లభించిందని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. ఆదివారం సంఘ సేవకుడు, గోల్కొండ జగదాంబిక అమ్మవారి వృత్తివార్ల సంఘం ప్రధాన సలహాదారులు ఎస్.రాజువస్తాద్ పర్యవేక్షణలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అమ్మవారి వృత్తి పనివారి సమస్యల పరిష్కారం, నూతన కార్యవర్గం, ఎంపిక తదితర విషయాలపై చర్చించారు. ఏసీపీ మాట్లాడుతూ.. గోల్కొండ కోట బోనాల ఏర్పాట్ల విషయం గురించి తనకు బాగా తెలుసు అని గతంలో తాను గోల్కొండ ఇన్‌స్పెక్టర్‌గా పని చేశానన్నారు. ఎస్.రాజువస్తాద్ మాట్లాడుతూ.. బోనాల నిర్వహణలో వృత్తిపనివారి పాత్ర ఎంతగానో ఉందన్నారు. గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులు, సంఘం అధ్యక్షుడు బి.సాయిబాబాచారి, గోల్కొండ మహంకాళీ ఆలయ పూజా బి.సురేష్‌చారి, నర్సింహ, బాబురావు, శ్రీకాంత్‌చారి తదితరులున్నారు.

పుప్పాలగూడలో సంబరాలు



సంబరాల్లో పాల్గొన్న నాయకులు

మణికొండ: దేశ ప్రధానిగా మూడో సారి నరేంద్రమోడీ ప్రమాణ స్వీకారం చేయటంతో మణికొండ మున్సిపాలిటీ, పుప్పాలగూడలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేశారు. బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచి మోడీకి అనుకూలంగా నినాదాలు చేశారు. దేశాన్ని అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలిపి, పదేళ్ల పాటు అవినీతి రహిత పాలన అందించారని బీజేపీ నాయకుడు సదానంద్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

అసదుద్దీన్‌కు మజ్లిస్ పార్టీ నాయకుల సన్మానం



అసదుద్దీన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

రాజేంద్రనగర్: హైదరాబాద్ లోక్‌సభ సభ్యునిగా విజయం సాధించిన మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీని రాజేంద్రనగర్ డివిజన్ మజ్లిస్ పార్టీ అధ్యక్షులు షేక్ రియాజ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. పార్టీ నాయకులు, రాజేంద్రనగర్ నుండి ర్యాలీగా బయలుదేరి అసదుద్దీన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

‘నీట్’ ర్యాంకర్ సౌమ్యకు సన్మానం



కుటుంబ సభ్యులతో సౌమ్య

శంషాబాద్: పట్టణంలోని ఊట్‌పల్లికి చెందిన నిరుపేద వ్యవసాయ కుటుంబానికి చెందిన సత్తయ్య, లలిత దంపతుల కుమార్తె తోట్ల సౌమ్య ఇటీవల నీట్‌లో ర్యాంకు సాధించింది. జాతీయ స్థాయిలో 36 వేల ర్యాంకును తెచ్చుకున్న సందర్భంగా సత్తయ్య స్నేహితులు, కుటంబసభ్యులు సన్మానించి అభినందించారు. ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అకాంక్షించారు.

ఐఐటీలో గిరిజన బాలుర జయకేతనం



బి. చందులాల్



బి భద్ర

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని గిరిజన బాలుర ఐఐటీ స్టడి సెంటర్ విద్యార్థులు ఐఐటి, జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో సత్తాచాటారు. 63 మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో పరీక్ష రాయగా ఇందులో 50 మంది ఐఐటి ర్యాంకులతో జయకేతనం ఎగురవేశారు. బి చందులాల్ 291వ ర్యాంకు, బి భద్ర 295, కే వినోద్ 338, జి హర్షి 625, బి తరుణ్ 626వ ర్యాంకులు సాధించారు. వెయ్యిలోపు 12 మంది ర్యాంకులు సాధించారు. కళాశాల ప్రిన్సిపాల్, గురుకుల ఉన్నతాధికారులు విద్యార్థులను అభినందించారు.

క్రమశిక్షణతో మంచి ఫలితాలు

గోల్కొండ: క్రమశిక్షణతో మంచి ఫలితాలు వస్తాయని మదర్సా ఇస్లామియా మారీఫుల్ ఇస్లాం ప్రిన్సిపాల్ ముఫ్తి మహ్మద్ వసీమ్ అహ్మద్ అన్నారు. మదర్సాలో వేసవి శిక్షణ శిబిరంలో శనివారం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. 40 రోజుల శిబిరంలో ఖురాన్ గ్రంథ పఠనంతో పాటు మానవ విలువలు వాటి ప్రాధాన్యంపై కూడా పిల్లలకు అవగాహన కల్పించారు.